ప్రజాశక్తి

శనివారం 15 జూన్ 2024

5

అల్లూరి సీతారామరాజు

జిఓ 3కి చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు :ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని జీఓ 3కు చట్ట బద్ధతను తక్షణమే కల్పించి, ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ పై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని లక్ష్మీపురం సర్పంచ్, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కొర్ర త్రినాధ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో మాట్లాడుతూ, మెగా డిఎస్సీ లో రూల్ అఫ్ రిజర్వేషన్ ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు చేయడం 5వ షెడ్యూల్ నిబంధనలకు విరుద్ధమన్నారు. నూరు శాతం రిజర్వేషన్ అమలు కు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. జాతీయ విద్య హక్కు చట్టం ప్రకారం రాష్ట్రం లో సుమారు 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని గత బి.జె.పి ప్రభుత్వం పార్లమెంటులో బహిరంగంగా ప్రకటించిందని, ప్రస్తుతం 16,349 ఖాళీ లు భర్తీకి వెల్లాడించడం సమంజసం కాదని విమర్శించారు. మిగిలిన ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు మాట్లాడుతూ, జీఓ 3కు చట్ట బద్ధత కల్పిస్తామని అరకు లోయలో చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో ప్రకటించిన ప్రకటనను మరిచారని విమర్శించారు. సిపిఎం మండల కార్యదర్శి పి.భీమరాజు, కె.శంకర్‌రావు, పి.రామదాసు పాల్గొన్నారు.

మన్యంలో పిడుగుల బీభత్సం

- కూలిన చెట్లు - వ్యక్తికి అస్వస్థత



పిడుగుపడి కూలిన చెట్టు

ప్రజాశక్తి -అరకులోయ:అరకులోయ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పిడుగులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి తీవ్రమైన ఎండకాసి మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు ఏర్పడింది. ఒకపక్క ఎండ కాస్తునే మరోపక్క మబ్బులు కమ్ముకొంటూ పెద్ద పెద్ద శబ్దాలతో పిడుగులు పడ్డాయి. దీంతో, అరకులోయ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. అనంతరం పిడుగుల వాన కురవడంతో ఈ ప్రాంతం వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఎక్కడ ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని, పిడుగులు ఎక్కడ పడుతుందోనని ఆందోళన చెంది బిక్కుబిక్కుమంటూ గడిపారు. సుమారు రెండు గంటల పాటు ఇదే పరిస్థితి నెలకొని కుండపోత వర్షం కురవడంతో అరకులోయ వాసులు అరచేతిలో ప్రాణం పెట్టుకుని కాలం వెలదీశారు. ఇంతటి పిడుగులు మును పెన్నడు పడలేదని స్థానికులు అన్నారు. స్లాబ్ ఇంటిలో నివాసం ఉండేవారు కాస్త ఊపిరి పీల్చుకున్నప్పటికీ, రేకు ఇల్లు, చెట్ల కింద ఇల్లులు ఉన్నవారు మాత్రం తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

అరకులోయలోని సిఏ హెచ్ స్కూల్ ఆవరణలోని ఎత్తైన పెద్ద పెద్ద సిల్వర్ హెూక్, పనస చెట్లపై పిడుగులు పడ్డాయి. దీంతో, ఆ చెట్లన్నీ పైనుంచి కింది వరకు చీల్చుకుపోయి కొన్ని చెట్లు నేలకొరిగాయి. ఆ సమయంలో విద్యార్థులు ఎవరు కూడా దగ్గరలో లేక పోవడంతో అందరూ పిలుచు ఊపిరి పీల్చుకున్నారు.

డుంబ్రిగుడ: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పిడుగుల శబ్దాలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉక్కిరిబిక్కిరైన గిరిజనులకు మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి కొంత ఉపశమనం పొందారు. పిడుగుల శబ్దాలతో వర్షం కురవడంతో గిరిజనులు భయాందోళనకు గురయ్యారు. మండలంలో శుక్రవారం జరిగిన అరకు వారపు కూరగాయలు ,అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి సంతలోకొచ్చిన గిరిజనులు పిడుగు శబ్దాలతో వర్షం కురవడంతో తిరుగు ప్రయాణంలో గిరిజనులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగించారు.

సపర్యలు చేస్తున్న కుటుంబీకులు

పిడుగుపాటుకు అస్వస్థత

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగిలో శుక్రవారం పిడుగుపాటుకు గురై ఓ గిరిజనుడు అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకుల కథనం ప్రకారం. కితలంగి పంచాయతీ పూలుగుడ గ్రామానికి చెందిన తాంగుల బాబురావు అనే గిరిజనుడు తమ నివాస గృహానికి అనుకొని ఉన్న పశువుల శాలలో నిలబడి ఉండగా శుక్రవారం మధ్యాహ్నం పిడుగు పడింది. ఈ శబ్దానికి గురైన అతను కోమలోకి వెళ్ళాడు. దీంతో, వారి కుటుంబీకులు అతనిని వెంటనే డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అరకులోయ ఏరియా హాస్పిటల్ కు తరలించారు. అక్కడ ఆయనకు ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

-ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో రూ కోటి 80 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ బరియాకుల వలస గ్రామంలో రూ 60 లక్షలు, బురిడీవలసలో రూ 60 లక్షలు, గోలంబో గ్రామంలో రూ. 60 లక్షలు వ్యయంతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ సెంటర్ల పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణం పనులు పటిష్టమైన నాణ్యతల పాటించాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నాణ్యతల విషయంలో ఎక్కడ రాజి పడొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఏఈ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

డ్రెయినేజీలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి -చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలలో పేరుకు పోయిన చెత్తను పంచాయతీ అధికారుల ఆదేశాలతో పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఈ మధ్యకాలంలో అడపా దడపా వర్షాలు పడుతున్న నేపథ్యంలో మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తను శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు.

డోలిలో తరలిస్తున్న కుటుంబీకులు

తప్పని డోలి కష్టాలు

-మార్గ మధ్యంలో గర్భిణి ప్రసవం - తల్లీబిడ్డ క్షేమం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పురిటి నొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళను డోలీలో మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రసవించిన ఘటన మండలంలోని బస్కీ పంచాయితి కొంత్రాయిగుడ గ్రామంలో సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. భర్త సమర్ధి దాసు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు..బస్కీ పంచాయితి కొంత్రాయిగుడ గ్రామానికి చెందిన సమర్ధి డాలిమ్మ నెలలు నిండటంతో శుక్రవారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. అంబులెన్స్ కు ఫోన్ చేసినా గంటన్నరసేపయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు సహాయంతో డోలీ మోతతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆమె మగ బిడ్డను ప్రసవించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

తనిఖీలు చేపడుతున్న సెక్రటరీ

ఆహార దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు :మండల కేంద్రంలో అల్పాహార తినుబండరాలు నిలువ ఉంచి విక్రహిస్తున్నారని మండల కేంద్ర వాసులు పిండి విజయ వెంకట రమణ, అనంతరావు, తదితరులు శుక్రవారం స్థానిక పంచాయతీ సెక్రెటరీ గోపి కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సెక్రెటరీ గోపి, స్థానిక వీఆర్‌ఏ గాసన్నలు రెండు దుకాణాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. నిల్ల ఆహార పదార్థాలను వినియోగించడంతో దుకాణాన్ని తాత్కాలికంగా మూయించారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ, కమర్షియల్ గ్యాస్ బండలు దుకాణాలలో వాడవలసి ఉన్నప్పటికీ ఎల్పిజి గ్యాస్ సిలిండర్లు వాడుతున్నారని, వీరిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమోసా దుకాణంలో రెండు ఎల్పిజి బండలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి కృషి

రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులను సత్కరిస్తున్న ఎంపిడిఒ, ఇతర అధికారులు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి

మండల అభివృద్ధి, సంక్షేమం ప్రధాన లక్ష్యంగా అధికారులు కృషి చేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు అధ్యక్షతన గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిత ఎమ్మెల్యే శిరీషాదేవికి రంపచోడవరం డిఎల్‌పిఒ రాఘవన్, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, పలు శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గత ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించి అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, ప్రజల అవసరాలను తీర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అధికారులు గతంలో అవలంభించిన తీరుతెన్నులను మార్చుకుని అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు పాటుపడాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మతం విజయభాస్కర్, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన్న డింభకేశ్వరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు గనజాల తాతారావు, జనసేన మండల అధ్యక్షులు బి.త్రిమూర్తులు, పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలి ఐదు సంతకాలతో ముఖ్యమంత్రి రికార్డు

రాజవొమ్మంగి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్ని కల్లో ఇచ్చిన హామీలు అమలుకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామమని, ఆయన చేసిన తొలి ఐదు సంతకాలతో రికార్డు సృష్టించారని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి విచ్చేసిన ఆమె స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద టీడీపీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, డీఎస్సీ అభ్యర్థులు, పింఛన్ల లబ్దిదారులు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి పాలనలో ఐదేళ్లపాటు నిరుద్యోగులు, చదువుకునే యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. డీఎస్సీ తీసుకురావడం వలన యువతలో కొత్త వెలుగు తీసుకువచ్చినట్లు అయిందన్నారు. సాధారణ అంగన్వాడీ కార్యకర్త అయిన తనను చంద్రబాబు నమ్మి పార్టీ టికెట్ ఇచ్చారని, నియోజకవర్గం టిడిపి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అత్యధికంగా ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు (30) అనే యువకుడు శుక్రవారం సాయంత్రం పిడుగు పాటుకు మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన కొల్లి నాగబాబు, తన మేనల్లుడు పెంటకోట దేవకిరణ్ శుక్రవారం ఏలేశ్వరంలో పనిముగించుకొని ఇంటికి తిరిగి బయలుదేరారు. నెల్లిమెట్ల గ్రామ శివారుకు వచ్చేసరికి ఆకస్మికంగా వర్షం రావడంతో చెట్టు కింద కూర్చున్నారు. ఈ సమయంలో వర్షంతో పాటు పిడుగు పడడంతో కొల్లి నాగబాబు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందగా, దేవకిరణ్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన స్థానికులు దేవకిరణ్‌ను లాగరాయి పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. మృతుడు నాగబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాగబాబు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-దేవీపట్నం

మండలంలోని ఇందుకూరుపేట రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ ఆఫీసర్ ఆర్.ప్రశాంతి ఆధ్వర్యాన రైతులకు వరి విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో ఎంటియు 1318, 1064 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీతో అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కుంజం మురళి, జెడ్పిటిసి శిరసం సత్యవేణి, ఎంపీటీసీ గారపాటి మురళి, టిడిపి మండల అధ్యక్షులు మరిచెట్ల బుజ్జి బాబు, నాయకులు మట్టమెహర్ బాబా గౌడ్, లంక హరిబాబు, మగాపు బాబురావు, ముంద్రు మధుసూదన్‌రావు, జనసేన నాయకులు కె.వీరబాబు, దివిటి ఆంజనేయులు, బిజెపి మండల అధ్యక్షులు సారపు రామన్న దొర, దాకారపు సత్యనారాయణ మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, కూటమి నాయకులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

నిబంధనల ప్రకారం పనులు పూర్తి

రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులన్నీ నిబంధన ప్రకారం పూర్తియాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తన చాంబర్ నుండి గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రారంభించిన పనులు ఈ స్టేజ్‌లో ఉన్నాయో మండలాల వారీగా ఆయన ఆరా తీశారు. పనులు సరిగా చేయని అధికారులకు నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. పనులు జరిగే ప్రాంతాలకు వెళ్లి ఆయా పనులకు వీడియోలు, ఫోటోలు తీసి సమర్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బర్త్ వెయిటింగ్ హాలు మంజూరైన వాటికి టెండర్లు పిలవాలన్నారు. మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది నివాస గృహాల నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని కోరారు. మారేడుమిల్లి మండలం ఇజ్జులూరు నేషనల్ పార్క్‌లో ఉన్న వాటిని గురించి ప్రభుత్వానికి నివేదికల సమర్పించడం జరిగిందని తెలిపారు. వైరామవరం మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది నివాస గృహాలు సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చైతన్య నేరుగా, డిఈలు నాగరాజు, గౌతమి, ఏఈలు సత్యనారాయణ, భాను, వీరభద్రరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

రక్తదానం శిబిరంలో మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ చైతన్య

రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలి

చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ చైతన్య

ప్రజాశక్తి-చింతూరు

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని, రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ సీహెచ్.చైతన్య పిలుపునిచ్చారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని పిఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం నష్ట పోయిన వారికి, రక్తహీనతతో బాధపడే వారికి రక్తం అవసరం ఉంటుందని, యువత రక్త దానం చేస్తే వారి ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుందని తెలిపారు. చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్ స్టోరేజ్ యూనిట్‌లో రక్త నిల్వలు అవసరం మేరకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా 20 మంది చింతూరు ప్రెస్‌క్లబ్ సభ్యులు, తెలుగు యువత కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ.కోటిరెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ కౌషిక్, జనరల్ మెడిసిన్ డాక్టర్ ఎం.సాయి కిశోర్, ఇఎన్‌టి వైద్యులు డాక్టర్ జోత్స్న ప్రియ భవాని, పిడియాట్రిషన్ డాక్టర్ హర్ష, గైనకాలజిస్టు డాక్టర్ శశికళ, డాక్టర్ స్పందన, తులసిపాక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, హెడ్ నర్స్ కె.కుమారి, ప్రెస్ క్లబ్ నాయకులు ఎస్‌కె.రియాజ్, తెలుగుయువత నాయకులు, ఎన్ జగదీష్, చింతూరు బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రామశేఖర్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సిమెంట్ రేకుల వితరణ

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ పరిధి వలసపల్లి గ్రామంలో పాఠశాల నిర్వహణకు తాత్కాలిక రేకుల షెడ్ నిర్మాణానికి పోలీసు శాఖ ఆధ్వర్యాన సిమెంట్ రేకులు అందజేశారు. వలసపల్లి పాఠశాలకు స్కూల్ భవనం లేకపోవడంతో విద్యార్థులు చెట్లు నీడన విద్యను అభ్యసించాల్సి వస్తోంది. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన సీలేరు ఎస్సై రామకృష్ణ పాఠశాల భవనం లేక ఎండకు ఎండి వానకు తడిస్తూ విద్యార్థులు పడుతున్న కష్టాలను కళ్లారా చూసి చలించిపోయారు. దీంతో ఆ గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి రేకుల షెడ్డు నిర్మాణానికి తాము సిమెంట్ రేకులు అందిస్తామని, గ్రామస్తులు షెడ్ నిర్మాణం చేసుకోవాలని సూచించారు. దానికి గ్రామస్తులు అంగీకరించడంతో ఎస్సై రామకృష్ణ తాత్కాలిక రేకుల షెడ్డు నిర్మాణానికి అవసరమైన సిమెంట్ రేకులు శుక్రవారం అందజేశారు. ఎస్సై రామకృష్ణ స్పందించిన తీరుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులు సమకూర్చిన సిమెంట్ రేకులను తీసుకెళ్తున్న గిరిజనులు

విరాళాలతో తాగునీటి పైప్‌లైన్ పనులు

ఇదీ గుమ్మడి గండువ గిరిజనుల దుస్థితి

గ్రావిటీ పద్ధతిన నీటి సేకరణకు అడ్డుకట్ట వేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని భీమవరం పంచాయితీ గుమ్మడి గండువ గ్రామంలోని గిరిజనులు చుక్క నీరు కోసం పాట్లు పడుతున్నారు. తాగునీటి సమస్యతో ఇక్కట్లు పడుతున్నారు. భీమవరం కొండ ప్రాంతంలో కుండీ ఏర్పాటు చేసి అక్కడ నుంచి స్వచ్ఛందంగానే పైపులు వేసుకుని గుమ్మడి గండువ గ్రామం వరకు కనెక్షన్లు తీసుకున్నారు. భీమవరం పంచాయితీ గుమ్మడి గండువ గ్రామంలో వరకు 4వేల 500మీటర్ల పైపులు పెట్టింది. పైపులకు రూ.1లక్షల 80వేల వరకు ఖర్చు అయింది. గుమ్మడి గండువ పీవీటీజీ మారుమూల గ్రామంలో సుమారు 350 జనాభా ఉంది. తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు, నాయకులకు మొర పెట్టుకున్నా తమ గోడు పట్టలేదు. వేసవికాలం కావడంతో నీరు కోసం ఇబ్బందులు పడు తున్నారు. గ్రామంలో ప్రభుత్వం నుంచి తాగునీటి పథకం, జలజీవన్ మిషన్, రక్షిత మంచినీటి పథకాలు నోచుకోలేదు. ఏమి చేయడానికి దారి లేక పోవడంతో ఇంటింటా చందాలు వేసుకున్నారు. తాగు నీళ్ల తెచ్చుకోవాలని ఊరంతా కదిలారు. అధికారులకు, సర్పంచ్, ఎంపీటీసీలకు ఎన్నో సార్లు చెప్పినా వారి ఘోష అర్థం కాలేదు. వీరి మాటలను పెడ చెవిన పెట్టడంతో విసిగి వేసారిన గుమ్మడి గండువ గ్రామ ప్రజలు ఇంటి ఇంటికి రూ3వేలు చొప్పున డబ్బులు వసూలు చేసి పైప్ లైన్ నిర్మాణానికి పూనుకున్నారు. రెండున్నర కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసుకున్నారు. ఇంకా 1 కిలోమీటర్ మేర పైప్ లైన్ నిర్మాణం, 5 వేల కెపాసిటీ కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయ డానికి డబ్బులు సరిపోక పోవడం తో నిలిచిపోయారు. దీంతో హుకుం పేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావు దృష్టికి సమస్య తీసుకెళ్లారు. ఆయన ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన పీఓ గ్రామంలో 5వేల లీటర్ల ట్యాంక్‌తో పాటు వీధి వీధి కుళాయిలు ఏర్పాటు కృషి చేస్తానని హామీ ఇచ్చారని గ్రామ ప్రజలకు ఎంపీపీ సూడిపల్లి కొండలరావు తెలిపారు.

రోడ్డు వెంబడి వేస్తున్న తాగునీటి పైపులైన్ పనులు

పైపులైన్ ఏర్పాటుకు గోతులు తవ్వుతున్న గిరిజనులు

ప్రీ స్కూల్ పిల్లలకు సర్టిఫికెట్ల అందజేత

సర్టిఫికెట్లను అందజేస్తున్న సిడిపిఒ సూర్యలక్ష్మి

ప్రజాశక్తి - చింతపల్లి : గ్రాడ్యుయేషన్ దినోత్సవం పురస్కరించుకొని అంగన్వాడీ కేంద్రాలలో విద్యనభ్యసిస్తున్న ప్రీ స్కూల్ చిన్నారులకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిని పి.సూర్యలక్ష్మి సర్టిఫికెట్లను అందజేశారు. గ్రాడ్యుయేషన్ దినోత్సవం లో భాగంగా శుక్రవారం చింతపల్లి వచ్చిన ఆమె స్థానిక ముత్యాలమ్మ ఆలయ సమీపంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రీ స్కూల్ పిల్లలకు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ రమణి, ఏసిడిపిఒ రామలక్ష్మి లతో కలిసి రైమ్స్ తదితర వాటిని చెప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో 3,214 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ కేంద్రాలలో మూడేళ్ల నుండి ఆరేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గ్రాడ్యుయేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు విజయ కుమారి, అప్పలనరస, సత్యవతి పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులు

- మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘటన

ప్రజాశక్తి - మాడుగుల : మాడుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో విద్యుత్ సంబంధించిన పనులను చేయించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని గదికి సంబంధించి ఏసీ మరమ్మత్తు పనుల నిమిత్తం విద్యార్థుల ఉపయోగించడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇదే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతంలో తరగతి గదులను పునరుద్ధరించడానికి విద్యార్థులతో పనులు చేయించినప్పుడు ఒక విద్యార్థి మృతి చెందడంతో పాటు మరో విద్యార్థి కాలు విరిగిన సంఘటనలు కూడా చోటు చేసుకుంది. మరల విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు రోజులు కూడా కాకముందే విద్యార్థులను పనులకు ఉపయోగించడం విశేషం. ప్రమాదకరమైన విద్యుత్ సంబంధిత షెడ్ పై నుండి విద్యార్థులతో పనులు చేయించడంపై పలువురు విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్యే రేగంకు సన్మానం

ఎమ్మెల్యే రేగంమత్స్యలింగంను సత్కరిస్తున్న సర్పంచ్‌ల ఫోరం ప్రతినిధులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకు నియోజకవర్గ నూతన శాసనసభ సభ్యుడు రేగం మత్స్యలింగంను స్థానిక మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిముడుహరి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. నియోజకవర్గం అభివృద్ధికి కషి చేయాలని సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జి నాగేశ్వరరావు, వి.వెంకటరావు, బోయి లచ్చు, ఎల్ అర్జున్, పి.అశోక్, టి.త్రినాద్, ఎంపిటిసిలు తుంనాధ్, పరశురామ్, వంతుల త్రినాథ్, వార్డ్ మెంబర్లు తాంగుల మధు, రామరాజు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల మండలం నరసన్నపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర హాస్టల్లో విద్యార్థులు చేరేందుకు ఖాళీలు ఉన్నట్లు ప్రధానోపాధ్యాయుడు భావరాజు శుక్రవారం ప్రకటన లో పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు 135 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. విద్యార్థులకు అన్ని వసతులు ఉన్నాయన్నారు.గుణాత్మకమైన విద్యభ్యాసం అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఫోన్: 8688525042 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

'పల్లా'కు టిడిపి రాష్ట్ర అధ్యక్ష పదవిపై హర్షం

ప్రజాశక్తి -గాజువాక : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నియామకంపై గాజువాక పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ మేరకు అధినేత చంద్రబాబు ప్రకటించిన వెంటనే, శుక్రవారం పాతగాజువాక జంక్షన్లో బాణాసంచాకాల్చి, స్వీట్లు పంచి సందడి చేశారు.

1968లో గాజువాకలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పల్లా శ్రీనివాసరావు జన్మించారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంటెక్, ఎంబిఎలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైన శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం విశాఖ-2 నియోజకవర్గంలో, ఎన్టీ రామారావు హయాంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. పల్లా శ్రీనివాసరావు, ఎంటెక్‌లో సివిల్ విభాగం కావడంతో, విశాఖ నగరంలో చాలా ప్రాజెక్టులకు ఉచితంగానే కన్సల్టేషన్ ఇచ్చేవారు. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ తరపున విశాఖ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావడంతో శ్రీనివాసరావు కూడాకాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014లో గాజువాక కాంగ్రెస్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బిఫారం ఇచ్చినప్పటికీ, టిడిపి టిక్కెట్‌కు ప్రయత్నించి, సాధించి, గెలుపొందారు. అయితే 2019లో గాజువాకలో జనసేనాని పవన్‌కల్యాణ్ పోటీలో ఉండడంతో టిడిపి అభ్యర్థిగా పోటీచేసి, వైసిపి చేతిలో ఓటమి పాలయ్యారు.. తర్వాత విశాఖ జిల్లా టిడిపి అధ్యక్షుడుగా చంద్రబాబు నియమిస్తే, రాష్ట్రంలో టిడిపి ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జిల్లాలో ఎలాంటి గ్రూపులకు ఆస్కారం లేకుండా అందరినీ సమన్వయం చేస్తూ పార్టీని సమర్థవంతంగా నడిపించారు.

తాజాగా 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో టిడిపి ఎమ్మెల్యేగా పల్లా గెలుపొందారు. అందరూ మంత్రి పదవి వస్తుందని ఆశించినప్పటికీ, రాజకీయ, కుల, ప్రాంతీయ సమీకరణల నేపథ్యంలో అది నెరవేరనప్పటికీ, అధినేత చంద్రబాబుకు పల్లాపై ఉన్న నమ్మకం, భరోసాతో టిడిపి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. పల్లాకు తెలుగుదేశం రాష్ట్రపగ్గాలు దక్కడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ, మంత్రి పదవి వస్తే చాలా బాగుండేదని కొందరు కార్యకర్తలు, స్థానిక నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

కేకు కట్‌చేసి సంబరాల్లో పాల్గొన్న విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి

తూర్పులో టిడిపి శ్రేణుల సంబరాలు

ఎంవిపి కాలనీ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే, విద్యావేత్త పల్లా శ్రీనివాసరావు నియామకంపై తూర్పు టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన పల్లా శ్రీనివాస్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, అధినేత చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జోన్ వన్ టిడిపి మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతనరెడ్డి నాయకులు కాళ్ల శంకరు గొలగాని గోపాలరావు, తెలుగు మహిళలు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎయును సందర్శించిన అమెరికన్ ఎంబసీ అధికారులు

అమెరికన్ ఎంబసీ అధికారులతో ఎయు విసి, రిజిస్ట్రార్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని అమెరికన్ ఎంబసీ అధికారులు సందర్శించారు. న్యూఢిల్లీలోని అమెరికన్ ఎంబసీ మినిస్టర్ కౌన్సిలర్ ఫర్ పబ్లిక్ డిప్లమసీ గ్లోరియా ఎఫ్ బెర్బెనా, హైదరాబాద్‌లోని అమెరికన్ ఎంబసీ పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మాక్లారెన్‌లు సందర్శించారు. ముందుగా ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అమెరికన్ కార్నర్ ప్రగతిని విసి ప్రసాద రెడ్డి వివరించారు. అనంతరం ఎయులో ఏర్పాటైన అమెరికన్ కార్నర్‌ను ప్రత్యక్షంగా సందర్శించి, నిర్వహణ విధానం, కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ పాల్గొన్నారు.

అడ్డతీగలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అతిథులు

ఘనంగా ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-అడ్డతీగల : అడ్డతీగల మండలం గొంటవానిపాలెం అంగన్వాడీ కేంద్రం-3లో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సర్పంచ్ పల్లాల ఏగులమ్మ, ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఓ వై.సుధా చేతుల మీదుగా పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ టీచర్ తిరుపతమ్మ, సూపర్వైజర్ వీరమ్మ, అంగన్వాడీ టీచర్స్ బి ఉషారాణి, బి ఝాన్సీ, కే లక్ష్మి, ఎన్ బేబీ తల్లితండ్రులు పాల్గొన్నారు

కొయ్యూరు : మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకొని ప్రాథమిక పాఠశాలలో చేరనున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఎం.మాకవరం కిచెన్ గార్డెన్, నాడు-నేడు బిల్డింగులను పరిశీలించారు. కార్యక్రమంలో కొయ్యూరు ఐసిడిఎస్ సిడిపిఓ విజయ్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నేతల పాలాభిషేకం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : రాష్ట్రంలో టిడిపి అధినేత చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా మారేడుమిల్లి మండలం టిడిపి ఉపాధ్యక్షులు దూడ సువర్ణ కర్ణకుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దూడ ప్రణీత్, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో శుక్రవారం మారేడుమిల్లిపై సెంటర్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి మొదటి రోజు ఐదు సంతకాలు చేశారని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో జీవో నెంబర్ 3 పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ తీయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు గొర్లె చిన నారాయణ, గరిడే బాబురావు, షేక్ బషీర్, షేక్ సుభాన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో కళింగులకు స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వేళ అన్ని సామాజిక తరగతులకూ న్యాయం చేసినా రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మంది ఉన్న కళింగ సామాజిక తరగతికి మంత్రి పదవి కేటాయించకపోవడం బాధాకరమని కళింగ సంక్షేమ సమితి అధ్యక్షులు కెవి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి తమ సామాజిక తరగతికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమితి నాయకులు పొందూరు సూర్యనారాయణ, డాక్టర్ వెంకట్, న్యాయవాది నరసింహస్వామి, ఎంవి.రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

జీవరాశిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భూగోళంపై ఉండే సమస్త జీవరాశిని కాపాడాల్సిన బాధ్యత మానవాళిదేనని విశాఖ ఎన్‌జిఒ అసోసియేషన్ కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ అన్నారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పర్యావరణ మాసోత్సవం గురించి ఇలా కలిసి మాట్లాడుకోవడం ఆనందదాయకమన్నారు. భూమి పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బాల వికాస ఫౌండేషన్ వ్యవస్థాపకులు నరవ ప్రకాశరావు, స్వాంతన సంస్థ ప్రతినిధి యాని గ్రేస్, ఎన్‌జిఒ సంస్థల ప్రతినిధులు స్నేహ, రాచెల్, జెవి.రత్నం, నిమ్మకాయల భాస్కర్, దేవి ప్రసాద్ పాల్గొన్నారు.

విధేయతకు ప్రాధాన్యత

అనితకు కీలకమైన హోంశాఖ

పార్టీ కార్యకర్తల్లో ఆనందం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు విధేయురాలుగా ఉన్న పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు మంత్రివర్గంలో సముచిత స్థానమే లభించింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఎన్నికైన అయ్యన్నపాత్రుడు వంటి సీనియర్లను కాదని, తమకు విశ్వాసపాత్రురాలిగా వున్న అనితకు తాజాగా హోంశాఖ, విపత్తుల నిర్వహణ వంటి కీలకమైన బాధ్యత చంద్రబాబు అప్పగించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు దక్కుతుందనుకున్న ఈ పదవి కూటమి ప్రభుత్వంలో అనిత పరమైంది. పాయకరావుపేట నుంచి 2014, 2024 ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి పోటీచేసి ఓటమిచెందారు. ఉమ్మడి జిల్లాలో ఇంతవరకు ఎవరికీ రాని హోం మంత్రి పదవి కూటమి ప్రభుత్వంలో అనిత సంపాదించుకున్నారు. మంత్రివర్గంలో కీలకమైన హోం శాఖ పదవి రావడంపై పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలుగా, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలుగా ఆమె గత ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఏ మాత్రం వెరవకుండా గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ఘాటైన విమర్శలు చేశారు. ఒక్కోసారి అయ్యన్నపాత్రుడు కంటే మించి ఆరోపణలు చేసి చంద్రబాబు వద్ద విధేయత కలిగిన కార్యకర్తగా గుర్తింపు పొందారు. ఆ గుర్తింపుతో కూటమి ప్రభుత్వంలో ఎస్‌సి మహిళా కోటాలో హోంశాఖ మంత్రి పదవి అనిత పొందగలిగారు.

టిడిపికి వ్యతిరేకంగా పనిచేసిన వ్యక్తుల పేర్లను రెడ్‌బుక్‌లో రాసినవారెవరినీ అధికారంలోకి వచ్చాక వదిలిపెట్టబోమని అనేకసార్లు లోకేష్ బహిరంగ సభల్లో మాట్లాడారు. ఆ రెడ్‌బుక్ తెరవడానికి అత్యంత విధేయత కలిగిన వ్యక్తి చంద్రబాబుకు అవసరం. రెడ్‌బుక్ కార్యం నెరవేరాలంటే ప్రస్తుతం తమ మాట ఏ మాత్రమూ జవదాటని అనితకు హోంశాఖ ఇవ్వడం సరైనదని చంద్రబాబు వ్యూహాత్మకంగా ఆలోచించి ఆ బాధ్యతలు అప్పగించారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

కెజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

కంటిలోకి దూసుకు వెళ్లిన కర్ర ముక్క తొలగింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయినిగా పేరుపొందిన కెజిహెచ్ చరిత్రలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద శుక్రవారం మీడియాకు తెలిపిన సమాచారం ప్రకారం.. నర్సీపట్నం మండలం గురందలపాలెం గ్రామానికి చెందిన మీసాల నాగేశ్వరరావు (39) ఈ నెల 4న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ఇంటి మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఆ క్రమంలో 12 అంగుళాల సరుగుడు కొమ్మ అతని కుడి కంటి నుండి మెదడు కింది భాగంలోకి చొచ్చుకుపోయింది. అతడు చూపును వెంటనే కోల్పోయాడు. మరుసటి రోజు అతన్ని కెజిహెచ్ ఒపికి తీసుకువచ్చారు. అతనిని టీం ఆఫ్ డాక్టర్స్, కంటి నిపుణులు, న్యూరో సర్జరీ డాక్టర్స్, ఆర్థోపెడిక్ డాక్టర్లు, ఇఎన్‌టి డాక్టర్, మత్తు డాక్టర్లు పరీక్షించి ఆపరేషన్ చేసి కంటిలో దూసుకుపోయిన కర్రను తీసివేయాలని తెలిపారు. సిటి స్కానింగ్, రక్త పరీక్ష, ఎక్సరే మొదలగు అన్ని పరీక్షలు చేసి పేషెంట్ అనుమతితో ఆరో తేదీ ఉదయం 11 గంటలకు ఆపరేషన్ నిమిత్తం న్యూరో సర్జరీ విభాగానికి షిఫ్ట్ చేశారు. టీం ఆఫ్ డాక్టర్స్ సరుగుడు కర్ర ముక్కను బయటకు తీసేశారు. ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ఆపరేషన్ తర్వాత హయ్యర్ యాంటీ బయోటిక్స్ పెట్టి, ఐసియు కేర్ ఇచ్చి ఏ రోజుకు ఆ రోజు డ్రెస్సింగ్ చేస్తూ పూర్తి పర్యవేక్షణతో ఉండటం వల్ల బాధితుడు నూరు శాతం కోలుకున్నాడు. సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తగిన తోడ్పాటు అందివ్వడంతో కంటి వైద్య నిపుణులు డాక్టర్ కళ్యాణి, డాక్టర్ దక్షిణామూర్తి, ఆర్థోపెడిక్ డాక్టర్ మురళీకృష్ణ, న్యూరో సర్జరీ డాక్టర్ హయగ్రీవరావు, మత్తు డాక్టర్లు రవి, శ్రీలక్ష్మి, నర్సింగ్ స్టాఫ్ సత్యవతి విజయవంతమైన ఈ ఆపరేషన్ నిర్వహణలో పాల్గొన్నారు.

చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి రైల్వే శాఖ ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ - సంత్రాగచ్చి ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 06007 ఎంజిఆర్ చెన్నై సెంట్రల్-సంత్రాగచ్చి స్పెషల్ జూన్ 14 రాత్రి 21.00 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 13.54 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 13.59 గంటలకు బయలుదేరి ఆదివారం 07.15 గంటలకు గమ్యస్థానమైన సంత్రాగచ్చి చేరుకుంటుంది. 06008 సంత్రాగచ్చి- ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ స్పెషల్ జూన్ 16న ఉదయం 10.00 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 01.48 గంటలకు దువ్వాడ చేరుకుని మరల 01.50 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 15:50 గంటలకు ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ చేరుకుంటుంది.

ఈ రైలు ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, దువ్వాడ, సామర్లకోట్, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదుగా ప్రయాణిస్తాయి.

డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సమస్యలను పరిష్కరించకుంటే గ్రామాన్ని ఖాళీ చేయం

- డిప్యూటీ తహశీల్దారుకు పార్వతీనగర్ గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పార్వతి నగర్ సమీపంలో 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని తాము స్వాగతిస్తున్నామని పార్వతినగర్ గ్రామస్తులు వంతల ప్రభాష్, మల్లేష్ పేర్కొన్నారు. అయితే తమ న్యాయపరమైన సమస్యలు పరిష్కరిస్తేనే పార్వతి నగర్ గ్రామాన్ని ఖాళీ చేస్తామని, లేకుంటే ఖాళీ చేసేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు వారు గురువారం జీకే వీధి డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాము నిరుపేద కుటుంబానికి చెందిన పివిటిజి గిరిజనులమని, 15 సంవత్సరాలు క్రితం నుండి ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని వెల్లడించారు. నిర్వాసితులుగా మారుతున్న తమకు ఇంటికొక ఉద్యోగం, పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వకుండానే ఏపీ జెన్కో అధికారులు తక్షణమే గ్రామాన్ని ఖాళీ చేసి వెళ్లి పోవాలని వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నోటీసులు జారీ చేసి దానిపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలు పరిష్కరించే విధంగా చొరవ చూపాలని డిటి కుమారస్వామికి విన్నవించినట్లు చెప్పారు. వెంటనే గ్రామాన్ని ఖాళీ చేస్తే తమ కుటుంబాలతో గూడు, ఉపాధి లేకుండా ఎక్కడ బతకాలని ప్రశ్నించారు. ప్రతి కుటుంబానికి ఉద్యోగ, ఉపాధి కల్పన, పక్కా ఇల్లు నిర్మాణం, విద్యుత్తు, తాగునీరు, రహదారులు ఏర్పాటు చేస్తేనే గ్రామాన్ని ఖాళీ చేస్తామన్నారు.

కేన్సర్‌పై వైద్య సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి శుక్రవారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ సూరజ్ గనోరే ఆదేశం మేరకు ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నోటి కేన్సర్, చెవి, ముక్కు, గొంతు కేన్సర్, గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్‌కి సంబంధించి స్క్రీన్నింగ్స్ టెస్టులు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌పిహెచ్ఎస్‌కి ట్రైనింగ్ ప్రోగ్రామ్, అవగాహన కార్యక్రమం రెండు రోజులుగా జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి గర్భాశయ ముఖ ద్వారం కేన్సర్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ జామలబాషా, డిసిహెచ్ఎస్ కృష్ణారావు, ఏడిహెచ్ఎంఓ శిరీష, డాక్టర్ డిసౌజ, ఎంపిహెచ్ఈఓ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని గరికిబంద నుండి గరిమండ వరకు 3 కిలోమీటర్లు మట్టి రోడ్డు వర్షం పడితే దిగబడిపోతుంది. వర్షా కాలంలో గిరిజనులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు బురదలో దిగబడిపోయి కదల్లేని స్థితి నెలకొంది. చినుకు పడితే ప్రయాణం నరకయాతనవుతుందని, బైకుల పైన మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేయాలని బూదరాళ్ల సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, సంజీవ్, పరిసర ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

అధ్వాన్న రోడ్డు ఇదే